
కూటమి నాయకుల ప్రతాపం

- 18 మంది కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాల తొలగింపు
- వారి స్థానాల్లో కూటమి నేతల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు
- కౌన్సిల్లో ఆమోదం తెలపాలని పట్టుబట్టిన టీడీపీ కౌన్సిలర్లు
- ససేమిరా అంటున్న చైర్మన్

మార్కాపురం టౌన్:

అధికారం తమ చేతుల్లో ఉంటే ఏదైనా సాధ్యమే అన్నట్లుగా కూటమి నాయకులు విర్రవీగుతున్నారు. అధికారం చేపట్టాక నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో అక్రమం చేసుకుంటూ వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ కార్యాలయంలో అదనంగా కాంట్రాక్టు కార్మికుల అవసరమని గుర్తించి అనుమతి పొంది వారికి ఉపాధి చూపారు. ఈ ప్రభుత్వంలో ఉపాధి చూపకపోగా ఉన్న వారిని తొలగించి కూటమికి సంబంధించిన నాయకుల పిల్లలను కాంట్రాక్టు కార్మికులుగా రంగంలోకి దించారు. అధికారం చేపట్టిన మరుసటి నెల నుంచే వారు విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు 6 నెలలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆప్కాస్ నుంచి అనుమతి పొంది వీరి పేర్లను నమోదు చేయించిన తర్వాతనే వీరికి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోంది. సుమారుగా ఇన్ని నెలలుగా పనిచేస్తున్నా జనవరి కౌన్సిల్ సమావేశంలో అంశంగా చేర్చడంతో టీడీపీ కౌన్సిలర్లు, చైర్మన్‌కు మధ్య వివాదానికి దారితీసింది. కౌన్సిల్ సమావేశం ముగిసేనాటికి కూడా ఈ అంశాన్ని ఆమోదించక పోవడంతో టీడీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ హాలులో హల్‌చల్ చేశారు.





కాంట్రాక్టు ఉద్యోగుల కొత్త లిస్టు ఇదే..

కాంట్రాక్టు కార్మికుల చేరికలు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన మరుసటి నెల (జూలై) నుంచే తమకు అనుకూలమైన వారి పేర్లను దశల వారీగా లిస్టును తయారు చేసి మున్సిపల్ కార్యాలయం ముఖ్య అధికారికి పంపారు. అయితే సదరు ముఖ్య అధికారి లిస్టులో ఉన్న వారి పేర్లను రిజిస్టర్‌లో నమోదు చేయించి మస్టర్ వేయడం ప్రారంభించారు. ఆప్కాస్‌లో పేర్లు నమోదైన వారికే మస్టర్ వేసి నెల వారీగా జీతాలు చెల్లిస్తుంటారు. జూలై 27న నలుగురు, ఆగస్టు 1న 9 మంది, ఆగస్టు 11వ తేదీన ఒకరు ఇలా చేరారు. మరో నలుగురు కాంట్రాక్టు కార్మికులు మృతి చెందటంతో వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాన్ని కేటాయించారు. మున్సిపల్ అధికారులు కూటమి నాయకులకు వత్తాసు పలకకపోతే తమకు బదిలీలు ఎక్కడ వస్తాయోనని వారు చెప్పిందే తడవుగా పనులు చేయడం ఎంతవరకు సబబని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇంతమంది ఉద్యోగులు గైర్హాజరవుతారా?

మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఇంత మంది ఉద్యోగులు గైర్హాజరయ్యే అవకాశం ఉంటుందా..అని కౌన్సిల్లో సభ్యులు అధికార పక్ష కౌన్సిలర్లను ప్రశ్నించారు. కక్షపూరితంగా కాంట్రాక్టు కార్మికులను తొలగించి వారి జీవనోపాధిని పోగొట్టారని చైర్మన్‌ను ప్రశ్నించారు. ఈ విషయాన్ని వదిలేది లేదని, కావాలంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వారికి న్యాయం జరిగేలా చూస్తానని కౌన్సిలర్ సభలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. తమ కూటమికి చెందిన వారికి కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చేందుకే విధులకు గైర్హాజరయ్యారనే కారణం చూపి తమ వారిని చేర్చుకోవడం మంచిది కాదన్నారు.

> **తొలగించిన కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తా:**
>
> 
>
> కాంట్రాక్ట్ కార్మికులు 18 మంది సంవత్సరాలుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తమకు గిట్టని వారిని గైర్హాజరు పేరుతో తొలగించడం అన్యాయం. ప్రభుత్వం నుంచి అనుమతి పొంది అదనంగా అవసరమైన కార్మికులను తెచ్చుకోవాలి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.
>
> – ఎం శ్రీనివాసులు, కౌన్సిలర్

నగర పంచాయతీకి రెండు యూనిట్ల మంజూరు

పొదిలి: కాపు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు రూ.5 లక్షల వరకు పొందేందుకు నగర పంచాయతీకి రెండు యూనిట్లు మంజూరైనట్లు కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉపాధి యూనిట్లు, జనరిక్ మందుల దుకాణం కోసం నిరుద్యోగ యువతీ యువకులు పోర్టల్లో దరఖాస్తులు పంపిచాలని శ్రీనివాసరావు సూచించారు.

పోలవరం ఎత్తు తగ్గించడం సరికాదు

పొదిలి: రాష్ట్ర ప్రజల జలజీవనాడిగా పేరొందిన పోలవరం ప్రాజక్టు ఎత్తు తగ్గించడం సరికాదని ఏపీసీసీ అధికార ప్రతినిధి, డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా ఒక ప్రకటనలో తెలిపారు. 45 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించటమంటే ప్రాజక్టు స్థాయిని కుదించడమేనని తెలిపారు. దీంతో బహుళార్థ సాధక ప్రాజక్టు పోలవరం, చిన్నపాటి నీటి నిల్వ రిజర్వాయర్‌గా మారుతుందని విమర్శించారు. కేవలం ఐదు వేల కోట్ల నిధుల మంజూరుతో ఎప్పటికి ఈ ప్రాజక్టు పూర్తవుతుందో అర్థం కాని స్థితి ఏర్పడిందని తెలిపారు. ఆంధ్రా కోడలు నిర్మలమ్మ బడ్జెట్ ఏపీకి ఏం మేలు చేయలేదని, ఢిల్లీ ఎన్నికలు, బీహార్ ముందస్తు ఎన్నికల కోసం బడ్జెట్‌లా ఉందని సైదా విమర్శించారు. హడావుడిగా బడ్జెట్ ప్రవేశ పెట్టడంలో ఆంతర్యం ఏమిటో కేంద్ర పాలకులకే తెలియాల్సి ఉందన్నారు.

క్లుప్తంగా

సూపర్‌సిక్స్ ఇస్తున్నాం కదా..

- మంత్రి డోలా



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

బేస్తవారిపేట: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలేదంటున్నారు.. పింఛన్లు ఇస్తున్నాము, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాము, మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాము కదా అంటూ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని చిన్న ఓబినేనిపల్లెలో శనివారం పింఛన్ల పంపిణీ చేశారు. మార్కాపురాన్ని తప్పనిసరిగా జిల్లా చేస్తామని, ఒంగోలు–కంభం హైవేరోడ్డును నాలుగులైన్లుగా మార్చుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

రాచర్ల: మండలంలోని యడవల్లి పంచాయతీ పరిధిలోని చర్లోపల్లె గ్రామ సమీపంలోని లెదర్ పార్క్ పక్కనే మరో పాదరక్షల తయారీ కేంద్ర భవన నిర్మాణం, నంద్యాల టూ గిద్దలూరు హై నుంచి పాదరక్షల తయారీ కేంద్రానికి వెళ్లేందుకు తారురోడ్డు నిర్మాణానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి చేతులు మీదుగా శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంపీపీ షేక్.ఖాశింబి, లెదర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, వైస్ ఎంపీపీ ఈదుల సుజాత, యడవల్లి సర్పంచ్ రంగలక్ష్మి, గృహనిర్మాణశాఖ డీఈ షేక్.ఖదీర్‌బాష, పంచాయతీరాజ్ ఏఈ రంగస్వామిరెడ్డి, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భారతిభాయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు ప్రారంభించిన గునుపూడి



పోటీలను ప్రారంభిస్తున్న గునుపూడి

పొదిలి: జిల్లా స్థాయి క్యారమ్స్ టోర్నమెంట్ పోటీలు శనివారం రాత్రి పొదిలిలో ప్రారంభమయ్యాయి. స్థానిక నిర్మమహేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఐటీ క్లబ్ టీస్టాల్ ఆవరణలో పోటీలను ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గునుపూడి భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మోరబోయిన శ్రీనివాసులు, షేక్.రసూల్, సామి రాజా, యాసిన్, మాజీ వైస్ ప్రెసిడెంట్ షేక్.జిలానీ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పురుగు మందుల పంపిణీ



రైతులకు పురుగుమందులు పంపిణీ చేస్తున్న ఏఓ, సర్పంచ్

బేస్తవారిపేట: జాతీయ ఆహార–పోషకాహార భద్రత కార్యక్రమంలో భాగంగా 50 శాతం సబ్సిడీపై పురుగు మందులను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. చెట్టిచర్లలో శనగ పంట సాగు చేసిన రైతులకు రాయితీపై మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతుల వెంకట కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, గ్రామ ఉద్యానవన సహాయకురాలు జ్యోతి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న సీఐ మల్లికార్జున

కంభం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కంభం సీఐ కె.మల్లికార్జున సూచించారు. స్థానిక వైజంక్షన్‌లో శనివారం రాత్రి ఎస్సై నరసింహారావుతో కలసి సీఐ ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనదారుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంటుందని హెల్మెట్ లేని పక్షంలో తలకు తీవ్రగాయాలై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.

వీరికి పింఛన్ డబ్బులు ఇక రావట!

- లిస్టులో ఆ పేర్లు హోల్డ్‌లో పెట్టిన ప్రభుత్వం

పొదిలి:

అత్యంత పేద కుటుంబాలు వారివి. కేవలం పింఛన్ డబ్బుల మీదనే జీవనం సాగించే పరిస్థితి. పింఛన్ డబ్బులు 1వ తేదీన చేతికి అందకుంటే కనీసం పొయ్యిలోని పిల్లి కూడా లేవని దుస్థితి. ఒకటో తేదీ కోసం ఎదురు చూస్తుంటారు. అయితే యథావిధిగా ఈ నెల ఒకటో తేదీన కూడా పింఛన్ ఇచ్చే వారు ఆ వీధికి రావటంతో వారికి ఆనందం కలిగింది. మీకు ఈ నెల నుంచి పింఛన్ రాదని పంపిణీ సిబ్బంది చెప్పడంతో వారి ఆనందం కాస్తా ఆవిరైంది. తీవ్ర నైరాశ్యం నెలకొంది. ఇక బతుకు ఎలా గడవాలిరా దేవుడా..అంటూ వారు నెత్తి నోరు కొట్టుకుంటున్నారు. అయ్యా తమకు పింఛన్ డబ్బులు ఇచ్చేలా చూడండయ్యా..అంటూ కనిపించిన వారినల్లా వేడుకుంటున్నారు. పట్టణంలోని బుగ్గజలం ట్యాంకు దగ్గర నివాసం ఉండే గుర్నాథం రాములు, నాగులూరి ప్రమీల డయాలసిస్ కేటగిరిలో కొంతకాలంగా పింఛన్ పొందుతున్నారు. లబ్ధిదారుడు రాములు కథనం ప్రకారం.. తాను పుట్టకతోనే దివ్యాంగురాలినని, మధ్యలో అనారోగ్య కారణాలతో కిడ్నీ కూడా తీసివేశారన్నారు. అప్పటి నుంచి ఏ పనికి పోవడం లేదని, పింఛన్ మీదే ఆధారపడి బతుకుతున్నానన్నారు. పింఛన్ ఆపేస్తే ఎలాగయ్యా.. అంటూ వేడుకుంటోంది. మరో వైపు నాగులూరి ప్రమీల పుట్టకతోనే దివ్యాంగురాలు. వీల్‌చైర్‌లో తప్ప బయట కాలు పెట్టలేని పరిస్థితి. పింఛన్ ఆగిపోవడంతో వారి కుటుంబం అయోమయంలో పడింది. ప్రమీలను ఎలా సాకాలో అర్థంగాక ఆందోళన చెందుతున్నారు.



గుర్నాథం రాములు



వీల్‌చైర్‌లో ప్రమీల

మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది: శ్రీనివాసరావు, కమిషనర్

నగర పంచాయతీ పరిధిలో మొత్తం 12 మంది పేర్లు హోల్డ్‌లో పెట్టారు. వీరు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాములు, ప్రమీల డయాలసిస్ కేటగిరిలో పింఛన్ పొందుతున్నారు. వెరిఫికేషన్‌లో వైద్యుల సర్టిఫికెట్ లేదు. దివ్యాంగుల కోటా కింది మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటాం.

ఘనంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవునికి శాంతి కళ్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కళ్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయ దాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ పి.కెశవరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



స్వామివారికి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో, గుండ్లకమ్మ నదీ ఒడ్డున ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు తులసీదళార్చన, పంచామృత అభిషేకాలు, సహస్తనామార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



ప్రత్యేక అలంకారంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి

4 నుంచి 18వ బ్రహ్మోత్సవాలు

ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ గుండ్లకమ్మ నదీ ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేజే నరసింహం తెలిపారు. 4వ తేదీన స్వామివారి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 5న శేష వాహనం, 6న హనుమంత వాహనం, 7వ తేదీన శ్రీవారి బ్రహ్మోత్సవ కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు స్వామివారి గరుడోత్సవం, 8వ తేదీ శనివారం స్వామివారి రథోత్సవం, 9న అశ్వవాహనో త్సవం జరుగుతుందని తెలిపారు. 10వ తేదీన స్వామివారి నగరోత్సవం ఉంటుందన్నారు.

శిథిలావస్థలో పల్లె రోడ్లు

పొదిలి: గ్రామాలకు రాక పోకలు సాగించే రోడ్లు పేరుకే తారు రోడ్లు. ఆ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే రోజు వారీగా నరకం అనుభవిస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోకాలి లోతు గుంతలు, లేచిన కంకర, ఆరేడు అడుగుల లోతులో మార్జిన్లకు ఇరువైపులా కాలువలు. ప్రయాణికుల వళ్లు గుల్ల కావడమే కాకుండా వాహనాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. ఆ..పల్లెటూర్లే కదా అంటూ అధికారులు పట్టించుకోవడం లేదు. పొదిలి మండలం జువ్వలేరు, దర్శి రోడ్డు నుంచి అన్నవరం రాక పోకలు సాగించే రోడ్డు, మూసీ ఆంజనేయస్వామి విగ్రహం నుంచి ఏలూరు రోడ్డు, అక్కచెరువు నుంచి రామాపురం వరకు, మార్కాపురం రోడ్డు నుంచి కొండాయపాలెం రోడ్డు, ఓబులక్కపల్లి రోడ్డులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అడుగడుగునా గుంతలతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కొనకనమిట్ల మండలం గనివనిపాడు రోడ్డు, కొంతమేర గొట్లగట్టు నుంచి నాయుడుపేట రోడ్డు, పాతపాడు నుంచి కాట్రగుంట రోడ్డు, పెదారికట్ల నుంచి ఒంగోలు రోడ్డు వయా ఇరసలగుండం రోడ్లు ప్రయాణాలకు అసౌకర్యంగా మారాయి. అధికారులు స్పందించి తగినన్ని నిధులు మంజూరు చేయించి రోడ్లను అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గనివనిపాడు రోడ్డు



జువ్వలేరు రోడ్డు



కొండాయపాలెం రోడ్డు



ఓబులక్కపల్లి రోడ్డు

సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు



ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స.హ చట్టం బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమాచార హక్కు బోర్డును ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు ఏర్పాటు చేయించారు. జనవరి 22వ తేదీన ‘సమాచారం..బహుదూరం’ అనే శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ స్పందించారు. పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి వివరాలతో గోడపై పెయింట్ వేయించారు. వ్యవసాయాధికారిణి కార్యాలయంలో పాత పేర్లను తొలగించి కొత్తవి రాయించారు. మిగిలిన శాఖలైన విద్యుత్ శాఖ, వెలుగు, గృహనిర్మాణశాఖ, ఐసీడీఎస్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖల అధికారులు మాకెందుకు అన్నట్లు బోర్డులను నేటికీ ఏర్పాటు చేయలేదు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: మండలంలో ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమఃఅంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు



వెలుగొండలో దర్శనమిస్తున్న శ్రీవారు

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

గిద్దలూరు రూరల్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు కేసులను పరిష్కరించుకునేలా చేయాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో టెలిఫోన్, బ్యాంక్ అధికారులను శనివారం సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల జాతీయ లోక్ అదాలత్ ఉందని, అందులో కక్షిదారులు కేసులు పరిష్కరించుకునేలా చూడాలన్నారు. కేసులను రాజీ చేసుకోవడం వల్ల ధనం, సమయం అన్ని వృథా కాకుండా ఉంటాయని చెప్పారు. సివిల్, క్రిమినల్, బ్యాంక్, టెలిఫోన్ కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, టెలిఫోన్‌శాఖ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.